# భర్తని ఆకట్టుకోవాలంటే?

భర్త తన చెప్పుచేతల్లో ఉండాలనీ, తన మాటను తు.చ తప్పకుండా పాటించాలనీ ప్రతి భార్య కోరుకుంటుంది. అలా జరిగినపుడు గర్విస్తుంది. అయితే అలా జరగడం ఎలా సంభవం? అన్ని విషయాలలో అతను ఆమెతో ఏకీభవించలేకపోవచ్చు. దాంతో ప్రారంభమౌతాయి చిర్రుబుర్రులు! అవే ఒక్కొక్కప్పుడు చినికి చినికి గాలివాన అవుతుంది. దాంతో ఆ సంసారం నిస్సారంగా సాగుతుంది. మరీ శృతి మించితే విడిపోయే పరిస్థితి కూడా రావొచ్చు.

పద్మినీ యోగీశ్ వరులిద్దరూ అందరిలాగే పెళ్ళి చేసుకున్నారు పెద్దల ఆశీర్వచనాలతో పలువురి మధ్య! పెళ్ళయి కాపురానికి వెళ్ళినప్పటినుంచి ప్రతీ పని పద్మిని ఆదేశానుసారం జరగవలసిందే.

యోగికి వంకాయ కూరంటే అసహ్యం. పద్మినికి అది పరమ ప్రియం. ప్రతి రెండు రోజులకొకసారి వంకాయ కూరచేసి పెట్టేది. ఆరోజు కూర లేకుండానే భోంచేసి అసంతృప్తిగా వెళ్ళిపోయేవాడు. అతనికి బంగాళా దుంపల వేపుడంటే ఇష్టం. ఆమెకది అసలు గిట్టదు. అందుకని ఆరు నెల్లకొక్కసారైనా ఆలుగడ్డ వేపుడు చెయ్యదు.

మొదటి రెండేళ్ళూ కొత్తపెళ్ళాం మోజులో సర్దుకుపోయాడు యోగీశ్వర్. దానికితోడు పద్మినికి యోగీశ్వర్ ఎవరితో మాట్లాడినా అనుమానమే! పాచిపని చేసే పనిమనిషి మొదలుకుని ఆఫీసులో టైపిస్టుదాకా, పక్కింటి పదేళ్ళ రజని దగ్గరనుంచి ఎదురింటి అరవై ఏళ్ళ పాపాయమ్మ గారిదాకా ఆయన ఎవరివంక చూసినా, మాట్లాడినా ఆరోజు పద్మిని అలకపాన్పు నలంకరిస్తుంది. దాంతో ఇద్దరిమధ్యా యుద్ధం మొదలయింది.

యోగీశ్వర్ సాధ్యమైనంత వరకూ ఇంటిపట్టున ఉండటం మానేశాడు. స్నేహితులతో షికార్లూ, కబుర్లతో కాలం గడిపేవాడు. దాంతో పద్మిని మరీ

రెచ్చిపోయి, ఎవరితోనో బయట అతను కాలం గడుపుతున్నాడని లేనిపోని మాటలతో, హింసించడం మొదలెట్టింది. ఎన్నోసార్లు ఇల్లువదిలి పెట్టి వెళ్ళిపోవాలనుకున్నాడు ఎటైనా. కానీ తనకున్న ఇద్దరు మొగపిల్లల మొహం చూసి వెళ్ళలేకపోయాడు!

సరిగ్గా ఆ సమయంలో ఎడారిలో ఒయాసిస్సులా పరిచయమైంది శ్యామసుందరి ఒక స్నేహితుని ద్వారా. శ్యామసుందరి అందకత్తె కాదు. పెద్ద తెలివి తేటలుకలదీ కాదు. కాకపోతే మంచి మనస్సు కలిగి, ఇతరులను నొప్పించకుండా సరళంగా మాట్లాడే స్వభావం గల మనిషి.

గలగలా మాట్లాడే ఆమె స్వభావం, సున్నితమైన ఆమె హృదయం, యోగీశ్వర్ ని ఆమె వైపు మొగ్గుచూపాయి. అతనికి తెలీకుండానే అతడు ఆమెకి దగ్గరయ్యాడు. మండే గుండెకి ఆమె మాట పన్నీటి ఊటలా అనిపించింది. మోడుభారిన అతని జీవితంలో ఆమె కొత్త ఆశలు కల్పింపజేసింది. అతను ఆమెకు దాసుడయ్యాడు. ఆ సంబంధం పవిత్రంగా నిలవడానికి ఆమె మెళ్ళో తాళి కట్టాడు.

శ్యామసుందరి ఎంత అందగత్తో, తన భర్త ఆమె సన్నిధి ఒదిలి రావడం లేదని, ఆమెను చూడాలని బయలుదేరింది పద్మిని ఒకనాడు. ఆమెను చూసి నోట మాటరాక మూగగా మిగిలిపోయింది. అందం కాదు కదా ఆకర్షణ కూడా లేదామెలో! తనముందు ఆమె కాకిలా ఉందని చెప్పొచ్చు! మరి ఎందుకు తన భర్త ఆమె చుట్టూ అలా తిరుగుతున్నాడు? సిగ్గువిడిచి ఆ మాటే శ్యామసుందరిని అడిగింది పద్మిని!

"పద్మినిగారూ! మనిషికి కావలసింది కేవలం బాహ్య సౌందర్యం ఒక్కటే కాదు. హృదయ సౌందర్యం చాలా ముఖ్యం. అడుగడుగునా అనుమానాలతోటీ, అర్థంలేని ఆవేశంతోటీ, పోట్లాటలు తోటి కాలం గడపటం ఎవరు కోరుకుంటారు? భర్తని ఆదేశించీ, బెదిరించీ, కట్టుదిట్టంలో పెట్టాలని భావించి అనేక ఆంక్షలు విధిస్తే అతను తనవాడవుతాడా? మమతల పందిళ్ళువేసి, తేనెలొలికే మాటల మూటలుగట్టి, అనురాగంతో ఆప్యాయతతో అతనిని ఆకట్టుకోవాలి! అప్పుడు

మొగాడు తనని విడిచిపొమ్మన్నాపోడు. మీరు చేయనిదీ, నేను చేసినదీ అంతే! నిజానికి యోగీశ్వర్‌ని నేను కలిసినప్పుడు అతను వివాహితుడని నాకు తెలీదు. అతను కూడా చెప్పలేదు. తీరా తెలుసుకునే సమయానికి మా ప్రేమ యుగయుగాల బంధంగా పెనవేసుకుపోయింది!

పద్మినిగారూ! మీ పరిస్థితిని నేనర్థం చేసుకోగలను. ఈ విషయంలో ఏ భార్యయినా, దేన్నైనా త్యాగం చేస్తుందేమోగానీ, తన భర్తని మాత్రం త్యాగం చెయ్యలేదూ, ఒకరితో పంచుకోలేదు నన్ను క్షమించండి" అంది శ్యామసుందరి ఆమెని లోపలికి ఆహ్వానిస్తూ.

ఇప్పుడు పద్మినిలో అసూయ లేదు! ద్వేషం లేదు! కక్ష లేదు! కనీసం తన కొడుకుల జీవితాలు తన భర్తలాగా కాకూడదని, తన కోడళ్ళకి శ్యామసుందరి చెప్పిన మాటల్ని మననం చేసుకుంటూ రోజుకొక్కసారైనా చెబుతుంది.

పద్మినిలో మార్పుని గ్రహించిన యోగీశ్వర్ ఒక వారం పద్మిని దగ్గరా ఒక వారం శ్యామసుందరి దగ్గరా గడుపుతున్నాడు! పద్మినికి అదే పదివేలు!"